క్లుప్తంగా

విశ్వశాంతి దూత ఏసు క్రీస్తు



మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: విశ్వశాంతి దూత ఏసు క్రీస్తు అని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. ఇందిరానగర్‌లో మంగళవారం పాస్టర్ ప్రశాంత్ కుమార్, మేరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకల్లో భాస్కరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన క్రీస్తు సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్పీ అన్నపూర్ణ, బండారు శ్రీనివాసరావు, కమిడి రామకృష్ణ, మార్కెండేయ రాజశేఖర్, ఉప్పాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం హనుమాన్ టెంపుల్ వెనుక చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ పరిశీలించారు.వార్డు పర్యటనలో భాగంగా ఆమె మంగళవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. జీవీఎంసీ వర్క్స్ అధికారులతో మాట్లాడారు.నిత్యం పనులను పర్యవేక్షిస్తుండాలని, పనుల్లో నాణ్యత లోపించరాదని సూచించారు. కార్యక్రమంలో వార్డు పార్టీ నాయకులు,గృహసారథులు,సచివాలయాల కన్వీనర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడాలి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వెంటనే రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వేస్టేషన్ ముందు ధర్నా చేశారు. మంగళవారం రైల్వే స్టేషన్ వద్ద విజయదుర్గ ఆటో ఓనర్ కం డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి మాట్లాడుతూ ప్రజా ఆస్తులైన విశాఖ స్టీల్ ప్లాంట్, బ్యాంకులు, పోర్టులు, హార్బర్లు, ఎల్ఐసీ ఇలా ప్రతీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం దారుణమని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇటువంటి నిర్ణయాలను విరమించుకోవాలని హెచ్చరించారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



గోదాదేవికి తిరువీధిలో హారతి ఇస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరిపై మంగళవారం ధనుర్మాస పూజలు విశేషంగా నిర్వహించారు. తెల్లవారుజామున 3గంటలకు స్వామికి సుప్రభాత సేవ చేశారు. విశేష ఆరాధన, చతుర్వేద పారాయణం, తిరుప్పావై సేవాకాలం అనంతరం గోదాదేవికి బేడామండపంలో తిరువీధినిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు సాతులూరి నరసింహాచార్యులు తదితరులు ఈపూజలు నిర్వహించారు.

ఘనంగా పగల్‌పత్తు ఉత్సవాలు

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పగల్‌పత్తు ఉత్సవాలు ఏడో రోజు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి పల్లకీ అధిష్టింపజేసి ఆలయ బేడా మండపంలో తిరువీధి నిర్వహించారు.

నాడు అధ్వానంగా.. నేడు అద్దంలా..





త్రినాథపురంలో నిర్మించిన నూతన రోడ్డు

- శిథిల రోడ్లకు మహర్దశ
- రాకపోకలకు మార్గం సుగమం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

సింథియా: జీవీఎంసీ40,62,63 వార్డుల రూపురేఖలు మారుతున్నాయి. అభివృద్ధి పరుగులు తీస్తోంది. కలగా మిగిలిన పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి చేసి ఆప్రాంత వాసుల కళ్లలో ఆనందం నింపుతోంది. గుంతలు, రాళ్లు తేలిన రోడ్లకు చికిత్స చేస్తోంది. అవసరమైన చోట రోడ్లను విస్తరించి అభివృద్ధి చేసింది. 2019కి ముందు ఈ వార్డుల్లో రహదారుల పరిస్థితి చూసిన ప్రజలు... ప్రస్తుత అభివృద్ధి చూసి హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

గతంలో..

టీడీపీ పాలనలో రోడ్ల అభివృద్ధిని గాలికి వదిలేశారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు రాకపోకలకు అష్టకష్టాలు పడేవారు. వర్షాలు పడితే ఆయా మార్గాల్లో ప్రయాణం నరకప్రాయంగా మారేది. రాళ్లు తేలిన రోడ్డులో తీవ్ర ఇబ్బందులు పడేవారు. నేడు అలాంటి రోడ్లను ప్రభుత్వం అభివృద్ధి చేసింది. ప్రజల కష్టాలకు చెక్ పెట్టింది. ఎక్కడ చూసినా సిమెంట్, తారురోడ్లు అద్దంలా దర్శనమిస్తున్నాయి. దీంతో రోడ్లపై ప్రజలు, వాహనచోదకులు హాయిగా ప్రయాణం సాగిస్తున్నారు. జీవీఎంసీ 40, 62, 63వ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు.

ప్రాంతాల వారీగా రోడ్ల నిర్మాణం ఇలా...

- జీవీఎంసీ 62వ వార్డు త్రినాథపురం ఆంజనేయస్వామి గుడి నుంచి దుర్గానగర్ మైదానం వరకు రూ. 26 లక్షలతో నూతన రోడ్డు నిర్మించారు.
- గుడివాడ అప్పన్నకాలనీ నుంచి సులభ్ కాంప్లెక్స్ వరకు 4 లక్షలతో రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.
- జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ యూపీహెచ్‌సీ వద్ద సుమారు రూ.16 లక్షలతో విశాలమైన మూడు రోడ్లు నిర్మించారు,
- జీవీఎంసీ 40 వార్డు ఏకేసీకాలనీలో సుమారు రూ.10 లక్షలతో రోడ్డు వేశారు.
- పలు ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టారు. అవసరమైన చోట డ్రైన్లు, కల్వర్టులు నిర్మించి రాకపోకలకు రాచబాట వేశారు.



క్రాంతినగర్ యూపీహెచ్‌సీ వద్ద రోడ్డు దుస్థితి



క్రాంతినగర్ యూపీహెచ్‌సీ వద్ద నిర్మించిన నూతన రోడ్డు



గుడివాడ అప్పన్నకాలనీ నుంచి దుర్గానగర్ వరకు..

రోడ్ల సమస్య తీరింది



మా వార్డులో రోడ్ల సమస్య తీరింది. గతంలో శిథిలమైన రోడ్లపై ప్రయాణించాలంటే భయమేసేది. రాత్రి వేళ ప్రయాణం చేయలేక వాయిదా వేసుకునే వాళ్లం. వర్షం పడితే గుంతల్లో నీరు నిలిచి పోయి పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. ఇప్పుడు రహదారుల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పాయి. – సూరిబాబు, 40వ వార్డు

సాఫీగా ప్రయాణిస్తున్నాం



గతంలో వ్యాపారం నిమిత్తం ఈ రోడ్డపై ప్రయాణం చేసేవాడిని. రహదారి సరిగ్గాలేక వ్యాపారం మానుకునే పరిస్థితి ఏర్పడింది. తాజాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టి తర్వాత రోడ్డు నిర్మాణం పూర్తి చేయడంతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. మళ్లీ వ్యాపారం ప్రారంభించాను. – సూర్యనారాయణ, 62వ వార్డు

రికార్డు స్థాయిలో రోడ్ల నిర్మాణం



ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలు అభినందనీయం. రోడ్లను రికార్డు స్థాయిలో అభివృద్ధి చేసింది. గతంలో ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం గుంతలు పూడ్చడంతో పాటు యుద్ధ ప్రాతిపదికన నూతనంగా రోడ్లు వేయడంతో అనుకున్న సమయానికే గమ్యం చేరుకుంటున్నాం. –రాంప్రసాద్, 63వ వార్డు

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

- వైఎస్సార్‌సీపీ 'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్
- 62వ వార్డులో రూ.1.83 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు

సింథియా: సంక్షేమంతో పాటు అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో సుమారు రూ.1.83 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైన్లు, సామాజిక భవనం, మెట్లు, వంటి పలు అభివృద్ధి పనులకు మంగళవారం వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలకు అండగా నిలుస్తున్నారన్నారు. భవిష్యత్తులో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. ఆయన నిర్ణయాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటే.. ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నాయని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించే వారికి ప్రజలు గట్టి బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పార్టీ మండల అధ్యక్షుడు భోగవిల్లి నాగభూషణం,నాయకులు గుడాల బాబూరావు, పెద్దాడ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేసిన పనుల వివరాలు

- అచ్చెంనాయుడులేవట్‌లో రూ.14 లక్షలతో సీసీ రోడ్లు, మెట్లు మార్గాలు
- గుడివాడ అప్పన్నకాలనీలో రూ.13 లక్షలతో సామాజిక భవనం నిర్మాణం
- త్రినాథపురం వై జంక్షన్ నుండి కొండవాలు ప్రాంతం వరకు 18.50 లక్షలతో సీసీ రోడ్లు, మెట్ల నిర్మాణం.
- రూ.19.25 లక్షలతో త్రినాథపురంలో సేవా సంఘం నుంచి కొండవాలు ప్రాంతం వరకు సీసీ రోడ్లు, డ్రెయిన్లు, మెట్లు.
- ప్రకాష్‌నగరలో రూ. 14.50 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం, కాలువలు మరమ్మతులు. – ప్రకాష్ నగర్‌లో సీసీ రోడ్లు, కాలువలు, మెట్లు మార్గాలకు రూ.15.50 లక్షలు.
- త్రినాథపురం కూడలి నుంచి అంబేద్కర్ కాలనీ సామాజిక భవనం వరకు రూ.19.65 లక్షలతో రహదారి మరమ్మలు.
- అంబేద్కర్‌కాలనీ సామాజిక భవనం నుంచి హైస్కూల్ వరకు రూ.18.95 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

సృజనకు దర్పణం వైజ్ఞానిక ప్రదర్శనలు

- ఎంఈవో దివాకర్
- గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్లో ఆకట్టుకున్న సైన్స్ ఫేర్



మేథమెటికల్ మోడల్ పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు



వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

గోపాలపట్నం: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని ఎంఈవో దివాకర్ అన్నారు. విషయ పరిజ్ఞానం, సాంకేతికతపై పట్టు సాధించేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన మండల స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలు వేపగుంటలో ఈ నెల 22న ఉంటాయని తెలిపారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను పరిశీలించి, అభినందించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు స్వామి నాయుడు, శేషుబాబు వ్యవహరించారు. కార్యక్రమంలో గోపాలపట్నం ప్రధానోపాధ్యాయుడు వైవీఎస్ వేణుగోపాల్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు పొందిన ప్రాజెక్టులు

- వ్యక్తిగత ప్రాజెక్టుల్లో హెచ్‌సీ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన రియల్‌టైమ్ ఆల్కహాల్ డిటెక్టర్ మొదటి బహుమతి సాధించింది.
- గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తయారు చేసిన వాయిస్ టాకర్ ఇండికేటర్ రెండో స్థానంలో నిలిచింది.
- గ్రూప్ ప్రాజెక్టులో గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విదార్థి తయారు చేసిన ఈజీ క్లీన్ నమూనా మొదటి స్థానంలో నిలిచింది.
- రెండో స్థానంలో మధురవాడ జీవీఎంసీ స్కూల్ విద్యార్థులు రూపొందించిన మస్క్యులర్ ఎనర్జీ టు ఎలక్ట్రికల్ ఎనర్జీ నిలిచింది.
- టీచర్ ఎగ్జిబిషన్ విభాగంలో ఉపాధ్యాయిని జి.కృష్ణవేణి మేథమెటికల్ మోడల్ ప్రదర్శించారు.

ఈవీఎంలపై అపోహలు వీడాలి



ఈవీఎంపై అవగాహన కల్పిస్తున్న ఆర్ఐ సురేష్ కుమార్, చిత్రంలో జెడ్సీ మల్లయ్య నాయుడు

గోపాలపట్నం: ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అపోహలు వీడాలని జోన్ – 8 కమిషనర్ మల్లయ్య నాయుడు సూచించారు. ఓటు వేసే విధానం అందరూ తెలుసుకోవాలన్నారు. ఈవీఎంల పనితీరుపై కొత్తపాలెం గోపాలపట్నంలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈవీఎంలపై ప్రజలకు చాలా అనుమానాలు ఉన్నాయని, అందుకే ఎన్నికల కమిషన్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పాల్గొని ఓటు వేసే విధానాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఓటు ఎలా వేయాలి, తాము వేసిన ఓటు తాను అనుకున్న వ్యక్తికి పడిందా లేదా అని సరి చూసుకోవచ్చని గోపాలపట్నం ఆర్ఐ సురేష్ కుమార్ వివరించారు. వీవీ ప్యాడ్‌లో వేసిన ఓటు మరో యంత్రంలో కనిపిస్తుందని, ఇది 5 సెకండ్లు మాత్రమే ఉంటుందని చెప్పారు. నమూనా యంత్రాలతో ఇక్కడి వారికి ఓటు వేయించి, చూపించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మాటకు కట్టుబడే నేత జగన్

- ఆయనే ముఖ్యమంత్రిగా మళ్లీ రావాలి
- క్లస్టర్ అధ్యక్షుడు బద్రీనాథ్



బుక్‌లెట్స్ ఆవిష్కరిస్తున్న బద్రీనాథ్ తదితరులు

మల్కాపురం: జగన్ మాట ఒక శాసనం .. ఆయన మాట ఇస్తే ఎంతటి కష్టం ఎదురైనా అది నెరవేర్చుతారని క్లస్టర్ అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. పల్లివీధి సచివాలయం పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ టెంపుల్ వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం బద్రీనాథ్ మాట్లాడుతూ సచివాలయం పరిధిలోని సుమారు 1100 కుటుంబాలకు రూ.18 కోట్లు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అందించిందని చెప్పారు. టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాంత వాసులకు ఇంత మేలు చేసిందా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ప్రజలకు భరోసా ఏర్పడిందని, ఆయనతోనే సంక్షేమం అని నమ్ముతున్నారన్నారు. విపక్షాలు గిట్టక ఎన్ని విమర్శలు చేసినా సంక్షేమ సారథి అయిన సీఎం జగన్ వెంటే ప్రజలు ఉంటారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆల్ఫా కృష్ణ,భోగవల్లి నాగభూషణం,పిలక రామ్మోహన్‌రెడ్డి,వరలక్ష్మి,ఎన్.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశాభివృద్ధి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వ రంగ పరిశ్రమలతోనే దేశం అభివృద్ధి చెందిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న సంస్థను ప్రైవేటీకరించాలనుకోవడం కార్మికులకు అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1041వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు సంబంధిత సమస్యలను వదిలి తమ రాజకీయ అవసరాల కోసం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ప్రజా ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలని.. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

పెన్షనర్ల హక్కుల కోసం పోరాటం



ప్రాంతీయ సమావేశం వివరాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

మురళీనగర్: హార్బర్–పోర్టు పెన్షనర్ల హక్కుల సాధనకు సమైక్యంగా పోరాడుదామని హార్బర్–పోర్టు పెన్షనర్ల అసోసియేషన్ తీర్మానించింది. సంఘం కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మినీ జనరల్ బాడీ సమావేశంలో ఈమేరకు నిర్ణయించారు. సంఘం అధ్యక్షుడు చౌదరి అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో ముంబాయి, గోవాల్లో నిర్వహించిన పెన్షనర్ల సబ్ కమిటీ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈనెల 24న మాధవదార తోటలో వనసమారాధనతో పాటు సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు.

కల సాకారమైన వేళ

- సొంత ఇల్లు చూసి లబ్ధిదారుల కళ్లలో ఆనందం
- జియోట్యాగింగ్ చేసిన అధికారులు
- సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



బ్లాక్‌లో లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ చేస్తున్న సీవో




టిడ్కో ఇళ్ల గురించి వివరిస్తున్న ఏపీడీ శ్రీరామ్, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: పద్మనాభనగర్‌లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఎన్నో ఏళ్ల నాటి కల నెరవేరిన సంతోషం అందరిలో కనిపించింది. వారి ముఖాలు వెలిగిపోయాయి. మాకు ఇల్లు వచ్చింది.. మా ఇళ్లు ఎక్కడుందో తెలిసింది.. ఎప్పుడు ఇంట్లో దిగుదామా అన్న ఆతృత వారిలో కనిపించింది. ఆ సమయం దగ్గరపడిందని వారిలో నమ్మకం కలిగింది. జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లోని టిడ్కో గృహాల వద్ద సుమారు 550మంది లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ చేసే ప్రక్రియ మంగళవారం మొదలైంది. నిర్మాణదారుల నుంచి ప్లాన్ సేకరించి బ్లాక్‌లు గుర్తించారు.

సందర్శించిన బెహరా భాస్కరరావు

జియో ట్యాగింగ్ చేసే ప్రక్రియను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల నిర్మాణంలో అవకతవకలపై సమీక్షించి ఈ ప్రాంతంలో అవసరమైన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇళ్లు నిర్మించి ఇచ్చారన్నారు. ఈ పనులు వేగవంతం చేసేందుకు పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ కృషి చేశారని తెలిపారు. వీరికి మనం అండగా నిలవాలని... వైఎస్సార్ సీపీ పట్ల విశ్వాసంగా ఉండాలని కోరారు. ఏపీడీ శ్రీరామ్ మాట్లాడుతూ ఇక్కడ మొత్తం 816 ఇళ్లు నిర్మించారని చెప్పారు. అందులో రుణాలు మంజూరైన, రిజిస్ట్రేషన్లు అయిన 550 మందికి జియో ట్యాగింగ్ చేస్తున్నామన్నారు. జనవరి 10 నాటికల్లా పూర్తి స్థాయిలో ఇళ్లు అందిస్తామని తెలిపారు. లబ్ధిదారులు సంక్రాంతి పండగ కొత్త ఇంట్లో చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 91, 92 వార్డుల అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి, నాయకులు గేదెల మురళీకృష్ణ, నీలాపు శ్రీనివాస రెడ్డి, కంపర రామకృష్ణ, సీవోలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



తమ ఇళ్లు చూసుకునేందుకు వెళ్తున్న మహిళలు

కోనేరు అభివృద్ధి పనుల పరిశీలన



లంకెలపాలెం కోనేరు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

అగనంపూడి: ప్రజలకు ఆరోగ్యం అందించడంతో పాటు జలాల సంరక్షణకు చెరువులు, కోనేరులను అభివృద్ధి చేస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. అమృత్ పథకంలో భాగంగా 79వ వార్డు లంకెలపాలెం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కోనేరు అభివృద్ధి పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం కోసం అర్బన్ గ్రీనరీ, బ్యూటిఫికేషన్ విభాగం ఆధ్వర్యంలో పనులు చేపట్టామని చెప్పారు. పనులు మందకొడిగా సాగడంతో అధికారులు, కాంట్రాక్టర్‌ను అడి గి కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.కోటి ఇరవై లక్షలతో పనులు ప్రారంభించామన్నారు. వాకింగ్ ట్రాక్, రక్షణ గోడ, పిల్లలు ఆడుకోడానికి వీలుగా పార్కు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్సీ పొందూరు సింహాచలం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి, ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, టీపీవో రేవతి పాల్గొన్నారు.